

# విసపు గుండె

కథానిక

రంధి సోమరాజు

నరసన్న నడుస్తున్నాడు. పొలం గట్టున-చంకన గొడుగు పెట్టుకొని మెల్లిగా నడుస్తున్నాడు. మెల్ల కన్నుతో ఎటో చూస్తున్నట్లు చూసి ఎటో చూస్తున్నాడు. గూని ఉన్నట్లు కొద్దిగా వంగిన నడుము ఎత్తి భయం భయంగా చుట్టూ పరికిస్తున్నాడు. మధ్యమధ్య ఎవరో తరుముతూన్నట్లు అడుగులు గబగబా వేస్తున్నాడు. తిరిగి నడక మందగించిపోగా ఇక ముందుకు నడవడం దుర్లభం అనుకుంటున్నాడు మొగాన పొడమిన చెమటను తుడుచుకుంటున్నాడు. 'ఇంత పాపం యెవ్వరూ చేయరు' అని అతని గుండెలోని గుండె అరుస్తూన్నా వినిపించుకోకుండా అతను అడుగులు ముందుకు వేస్తున్నాడు.

ఆ అరుపు పొలాలు వింటున్నాయి. వింటున్నాయని నరసన్నకు తెలుస్తోంది. అందుకనే అవి తలలు అలా కదుపుతున్నాయి.

తుమ్మచెట్లు కూడా వింటున్నాయి మోకాళ్లు దిగిదిగని అతని పంచె పట్టుకొని అవి అతన్ని వెనక్కి లాగి నిలేస్తున్నాయి. "వద్దు సుమా... ఇంత ఘోరానికి పూనుకోవడం పాపం సుమా" అంటున్నాయి.

అదిగో కాలువ! అది కూడా విన్నది. విన్నట్టే కదులుతోంది. విని అతనికన్నా ముందు ఇంటికి వెళ్తోంది. ఇంటిదగ్గర ఈ రహస్యం తప్పక చెప్పుతుంది.

నరసన్న కాలువ ఒడ్డున కూలబడ్డాడు. నరసన్న భయం కాలువ ఒడ్డున కూర్చుంది. దానికి దాహంయింది. సాయంకాలం ఎప్పుడూ వేయని దాహం. అందులో వర్షాకాలం. నరసన్నకు దాహం వేసింది. చేతులు చాచాడు. గజగజ వణుకుతూన్న చేతులతో నీళ్ళను తాకాడు. జల-జల నీళ్ళు చేతులలో ఇమడకుండా జారిపోయాయి. "మమ్ము తాకకు దుర్మార్గుడా" అన్నాయి. నరసన్న పెదవులు తడుపుకోలేక పోయాడు. నరసన్న లేచి నిలబడ్డాడు. ఆ మూల సూర్యుడు, "నీవు వెలుతురులో ఉండవలసిన వాడివి కాదు..." అంటూ కోపంతో అస్తమించి పోయాడు. నరసన్న ముందుకు నడిచాడు. అతనితో చీకట్లు నడిచాయి. అతనిలో చీకట్లు నిండాయి. చీకటిలో నరసన్న, చీకటితో నరసన్న నడవలేక నడుస్తున్నాడు. ఇంటికి వెళ్ళలేక వెళుతున్నాడు. పాపం నరసన్న కాళ్ళల్లో కాళ్ళు లేవు.

నరసన్న పిసినిగొట్టు. నరసన్న బడిపంతులు. పిసినిగొట్టు నరసన్న నీతిపరుడు కాదు. బడిపంతులు నరసన్న సన్మార్గుడు కాదు. బడిలో పిల్లల్ని నరసన్న ఎప్పుడూ కొట్టడు. పాలూ, పెరుగూ, పిడకలూ, పుడకలూ తెమ్మని మాత్రం తొడపాశం పెడతాడు. చెవి మెలిపెట్టడం, తొడ పాశం పెట్టడం, కొట్టడంలోకి రావని నరసన్న ఉవాచ!

నరసన్న నోట్లు వ్రాస్తాడు. ఈ విషయంలో అతనెంత ఆరితేరినవాడో చెప్పలేం. అతను రకరకాల సిరాలతో, రకరకాల దస్తూరీలతో పాతకాలపు రెవెన్యూస్టాంపుల ఒకటో రకం నిధులతో జరిగిపోయిన కాలం వృధాగా పోకుండా కట్టబడ్డ ప్రాజెక్టు! ఇక కోర్టులలో

సాక్ష్యాలకు ఎంచక్కా హాజరౌతాడు. ప్లీడర్లను జడ్జీలను బలేగా లెకమకలు పెడతాడు.

నరసన్నకు డబ్బు కావాలి. అది ఏదో విధంగా రావాలి. న్యాయాన్యాయాలతో అతనికి నిమిత్తం లేదు. నీతి నియమాలకు అతను కట్టుబడలేదు. నరసన్న బక్క పలచగా ఉంటాడు. అంత ఎత్తరి కాడు. మొగాన మశూచికపు గంట్లు లేవుకాని, చిన్నప్పుడు ఎవ్వరో రాళ్ళతో చితకబాదవగా ఏర్పడిన మచ్చలున్నాయి. అతని కళ్ళల్లో రక్తం లేదు. ముంచు ముక్కలమీద శీతాఫలాల పిక్కల్లా ఆ కళ్ళల్లో గ్రుడ్లు ఉంటాయి. నెత్తిమీద గాలి ఎలా వీచినా ఒక్కలాగే నిలిచే జుత్తు ఉంది. మూతిమీద అక్కడక్కడ మొలచిన మీసాల మరకలున్నాయి. చంకలో గొడుగు సరేసరి... అది ఎప్పుడూ అతనితోనే పుట్టినట్లు అక్కడ ఉంటుంది. మొలలో అతని సంపాదన జాగ్రత్తగా నిద్రపోతూ వుంటుంది. ఎకరం ధరకు సరిపడే స్టాంపు అక్కడ ఉంటుంది. ఆ పొలం కాస్త నరసన్న పేరిట కాగితాలమీద నమోదు కాగానే ఆ డబ్బు అక్కడ నిండుకుంటుంది. నరసన్న ఇంటిలోని పెట్టెలను, వాటి తాళాలను ఎప్పుడూ నమ్మడు. అందువల్ల అతని కెప్పుడూ నిద్రపట్టదు. ఒకవేళ పట్టినా ఆ నిద్రపగలే పడుతుంది!

నరసన్నకు పిల్లలు లేరు. పిల్లలు ఉండకుండా ఉండడమే అతనివాంఛ! ఈ కోరికకూడా అతనికి నెరవేరింది. పిల్లలు లేకపోవడంవల్ల అతనికీ డబ్బు మిగిలింది. డబ్బు మిగలడంవల్ల అతని పరపతి పెరిగింది. ఇది అతని ఊహ!

నరసన్న భార్యపేరు సూరమ్మ. ఎప్పుడూ కష్టపడే మనిషి. ఒక్క నిమిషం ఊపిరి తీసుకోదు. క్షణం చేయి ఊరకనేఉంచదు. చీకటితోనే లేస్తుంది. మజ్జిగ చేస్తుంది. గొడ్లసాకిడ, వాకలి ఊడుస్తుంది. కళ్ళాపుజల్లి ముగ్గులు పెడుతుంది. అప్పటికి తెల్లవారుతుంది. భర్తలేచి మొగం కడుగుకొని స్నానం చేసిన మీదట అతనికి చద్దన్నంపెట్టి బడికి పంపుతుంది. ఈలోగా ఇంటికి కావలసిన నీళ్ళుకూడా మోసేస్తుంది. ఆమీదట ఇంట్లోకి కావలసిన నెలకు సరిపడే పప్పుకోసమో, బియ్యం కోసమో కందులు కాని, వడ్లుకాని ఎండబెడుతుంది. ఈలోగా వంట పూర్తిచేసి, మధ్యాహ్నం కందులను విసురుతుంది. వడ్లయితే దంచుతుంది. పొరుగింటి ఇల్లాలు ఇంత సాయపడితే ఆ మరునాడు ఆమె కంతకంతా సాయం చేసేస్తుంది. ఇల్లంతా పూర్తిగా పేడతో అలికి ముగ్గులు పెడుతుంది. అక్కడక్కడ పంది కొక్కులు కన్నాలుపెడితే వాటిని మెత్తుతుంది. మూడేసి నెలల కొకసారి ఇల్లంతా తడిపి, పొక్కు తీసి మన్నూ పేడా కలిపి పాముతుంది. ఇల్లు గచ్చులా నున్నగా తయారుచేస్తుంది. ఇక పండగలకు గోడలకు సున్నం ఆమే వేసుకుంటుంది. ఇన్ని చేసినా నరసన్నకు తృప్తి ఉండదు. సూరమ్మ అన్నం తినడం మానేసి పని చేయగలిగితే ఎంత బాగుండును అనుకుంటాడు!

ఇక నగలసంగతి చెప్పవలసిన పనేలేదు. చేయించమని ఆమె అడుగదు. చేయించాలని అతనికి తోచదు. మెడలో నల్లపూసల తాడు ఉంది. పసుపు పచ్చని తాడులో మెరిసిపోయే మంగళసూత్రం ఉంది. కాళ్ళకు పాంజేబు పట్టాలు ఉన్నాయి. ముక్కున పుడక ఉంది. చెవులకు తెల్లరాళ్ళ దుద్దులున్నాయి. చేతులకు మామూలు గాజులే. కష్టపడే మనిషేమో కాస్త మోటుగా ఉంటుంది. ఆమె శరీరంలోని లావణ్యాన్ని ఆమె ఎండలో నిలిచి పిడకలు చరిచేప్పుడు సూర్యుడు కమ్మగా చప్పరించేశాడు. ఎర్రగా ఆమె శరీరం చేవదేరి ఉంటుంది.

సూరమ్మ ఎత్తరి! అంత పెద్దకళ్ళకు కాటుక పెట్టుకొని, కొప్పులో పూలు తురుముకొని ఎర్రని గులాబీరంగు జాకెట్టుమీద పచ్చచీర పదిలంగా కట్టుకొని చిలకలా వనలక్ష్మిలా ఎప్పుడేనా సాయంకాలం వీధిగుమ్మంలో నిలబడితే నరసన్న చూడలేడు. "అలా కొరివిదయ్యంలా నిలబడక పోతే గొడ్లకు కుడితి పెట్టరాదూ!" అంటాడు. ఆమె మొగం చిన్నబుచ్చుకుంటుంది. ఆమె మనసు చిన్నవోతుంది. ఆమె పనిలోకి పోతుంది. ఆమె దాసీ...

నరసన్నకు ఈమధ్య ఒక కొత్త ఆలోచనతట్టింది. చేతి కందివచ్చిన పుత్రవాణ్ణి ఒకణ్ణి పెంచుకుంటే బాగుండును అనుకున్నాడు. అలా చేస్తే ఉన్న పదిఎకరాలకు తోడు మరొక పది ఎకరాలు కౌలుకు పుచ్చుకొని, చక్కగా సేద్యం చేయొచ్చు... సంచులకొద్దీ డబ్బుసంపాదించవచ్చు అనుకున్నాడు.

ఇందుకు పాలికాపును పెట్టుకుంటే ఏమీ లాభం లేదనుకున్నాడు. వాడికొక్కడికే ముప్పై బస్తాల ధాన్యం పోయవలసి ఉంటుంది. అంచేత కుర్రాణ్ణి పెంచుకుంటేనే బాగుంటుంది. ఎంతయినా వాడి క్రింద పదిబస్తాలకన్న ఖర్చు ఉండదు. ఇలాగ కూడా ఇరవై బస్తాల మిగులు ఉంటుంది, అనుకున్నాడు. కాని పెంచుకోవడం అంటే మాటలా? వాడు చివరికి ఆస్తికంతకూ హక్కుదారుడై పోతాడు.

"అందుకనే ముందుగానే పెంచుకుంటామని చెప్పగూడదు, ఓ సంవత్సరం చూస్తాను. వాడు మంచివాడు, నమ్మకస్తుడు, నన్ను సంరక్షించేవాడు అని తోస్తే తప్పక దత్తత చేసుకుంటాను" అని అనాలనుకున్నాడు.

ఈ విషయం భార్యతో సంప్రదించాల అని నిర్ణయించుకున్నాడు. నరసన్న ఎప్పుడూ ఏ విషయమూ ఇంతకు పూర్వం భార్యతో సంప్రదించ లేదు. కాని ఈ విషయంలో మరి తప్పని సరే అయింది. అందుకు కారణం ఆ పెంచుకోబోయే కుర్రాడు సూరమ్మ అక్కకొడుకు. ఆమె ఇద్దరు కొడుకులను కని చనిపోయింది. వాళ్ళిద్దరూ తండ్రి వద్దే పెరిగారు. అందులో పెద్దవాడికి పెళ్ళయింది. చిన్నవాడికి ఆ తండ్రి పెళ్ళిచేసే స్థితిలో లేడు.

నరసన్న ఓ రోజున భార్యకి విషయమంతా చెప్పాడు. "పెంచుకుంటాం" అని చెప్పి ఆ కుర్రవాణ్ణి తీసుకరమ్మని ఆమెను బలవంతం చేశాడు. సూరమ్మ భర్త దురుద్దేశాన్ని కనిపెట్టింది. కాని ఆ సంగతి అతని మొగంమీద అనెయ్యడానికి జంకింది. అయినా మెల్లిగా "వద్దుబాబూ... నువ్వు తిన్నసైనోడివి కాదు..." అంది. సూరన్న "ఛస్ నీకేమీ తెలియదు... బండముండా..." అంటూ బూతులు కూశాడు. సూరమ్మ భయపడింది. అయినా 'ఆ పెంచుకునేదేదో ఇప్పుడే పెంచుకోరాదూ... కొన్నాళ్లపాటు చూత్తాననడం దేనికి' అంది. సూరన్నకు కోపం మిక్కుటంగా వచ్చేసింది. కాని తమాయించుకున్నాడు.

మెల్లిగా ఆరాత్రి భార్యను బ్రతిమాలాడుకాని అందుకామె ఒప్పుకోలేదు. 'అబద్ధాలాడి, అడ్నిక్కడకు తీసుకరావడం నావల్ల కాదు బాబూ...' అంది. 'వాళ్ళకు చేదోడువాదోడుగా ఉన్నవాణ్ణి ఇక్కడకు తీసుకొచ్చి, చాకిరీ చేయించుకొని తిరిగి వాణ్ణి ఇంటికి తోలేస్తే... అమ్మో ఇంకేమేనా ఉందా... ఆ తలవొంపులన్నీ నేను భరించలేను. ఆ చెప్పేదేదో ఎట్టా చెప్పుతావో నువ్వేచెప్పి అడ్నిక్కడకు తీసుకరా...' అంది. సూరమ్మ ఇంత మొండిగా చెప్పేటప్పటికి నరసన్న హతాశుడై పోయాడు. చేతికొచ్చే లాభం ఇట్టే మాయమైపోయి నట్లు బాధపడిపోయాడు. ఈ విషయం ఒకవారం రోజులు ఆమెకు నచ్చచెప్పాడు. ఆ వారం రోజులూ ఆమె ఆ విషయమై ఆలోచించింది. ఆలోచించే కొద్దీ ఆమెకు భయం ఎక్కువై పోయింది.

ఆ పిల్లవాడు నవ్వుతూ ఇక్కడకు వచ్చినట్లు ఆ మరునాటినుంచే వాడి నవ్వు మాయమైపోయి నట్లు హడలిపోయింది. వాడు అన్నం తింటూ వుంటే—సూరన్న, 'శేరు బియ్యం అన్నం తినేస్తాడే...' వాడు వేణ్ణీలు పోసుకుంటే... 'చణ్ణీళ్ళు పోసుకోలేడు కాబోలు...' వాడు తలకు చమురు రాసుకుంటే, 'అంత జుట్టెందుకో...' వాడు చుట్ట కాలిస్తే, 'పీశెడు పొగాకు వీడికి మూడురోజులొచ్చేట్టులేదు...' ఇలాగే ఇలాగే ఎన్నో అంటూన్నట్లు, విసుక్కుంటూన్నట్లు, మూలుగుతూన్నట్లు, బాధపడిపోతూన్నట్లు, విసపు చూపులు చూస్తూన్నట్లు పిల్లవాడి మనసు విరిచేస్తూన్నట్లు, ఊహించుకుంది.

ఇక వాడ్ని ఇంటిదగ్గర క్షణం నిలవనివ్వకుండా ఆ పనిచెప్పి, ఈపనిచెప్పి, ఆ పెంట తోలించి, ఈ గొప్ప త్రవ్వించి, పనిలేకపోతే కూలిపనికి పొమ్మని ఎంతో ఎంతో హింసించి నానా యాతనలూ పెడుతూన్నట్లు భావించుకుంది. వాడు ఏడుస్తూ తిరిగి ఇంటికి పారిపోయినట్లు అందరూ ఇందుకు తననే తూలనాడుతూన్నట్లు కలపోసింది. 'అమ్మో ఇక్కడ వాడు బతకలేడు. వాణ్ణి నేను చేతులార చంపుకోవలసి వస్తుంది...' అనుకుంది. ఈ భయంతో నరసన్న మాటలు ఆమె పూర్తిగా ఈవిషయంలో వినడం మానేసింది.

ఆ రోజు నుంచీ నరసన్న ఆమెతో సరిగా మాట్లాడలేదు. మాట్లాడినప్పుడల్లా సూరమ్మను పచ్చిబూతులతో తిట్టి ఆమెను గాయపరచేవాడు. కడమాటగా, 'గొడ్డుబోతుముండా...' అని ఆమె

మొగంమీద ఉమ్మేస్తూన్నట్లు మొగంపెట్టి, చేతులూ కాళ్ళూ వికారంగా కదిపి అరచేవాడు. ఈ మాట సూరమ్మ వినలేక పోయేది. చెంగు కళ్ళ కడ్డు పెట్టుకొని ఏడ్చేది. గుండెల్లో కుమిలి పోయేది.

భార్యను ఒప్పించలేని నరసన్న ఆమెను ఏమీ చేయలేని నరసన్న గుండెల్లో ఆమెమీద కక్ష కట్టాడు.

ఆ కక్ష అతన్ని అనేక రకాల ఆలోచనలకు దింపింది. ఓ రోజున తెల్లవారు ఝామున నరసన్న ఊహాలు చాల విచిత్రమైన ధోరణిలో నడిచాయి. 'ఆ...అలా చేస్తే బాగుంటుంది' అనుకున్నాడు. 'రెండెకరాల కట్నం కూడ సంపాదించవచ్చు....' అనుకున్నాడు. పెళ్ళాం ఉండగా మరో పెళ్ళికి ప్రభుత్వం ఒప్పుకోదుగా అని భయపడ్డాడు. అయినా తల్లీ, తండ్రీలేని ఎనకాముందూ ఎవ్వరూ లేని, ఈ చచ్చు పీనుగ ఏంచేస్తుంది అని స్థిమిత పడ్డాడు. కాని భార్య ఉండగా ఈ ఊళ్ళో పిల్ల నిచ్చేవాళ్ళెవ్వరు అని వాపోయాడు. ఒకవేళ ఇచ్చినా, వీళ్ళిద్దరితో ఎవ్వరు వేగగలరు? వేగ గలిగినా వీళ్ళకు తిండెవ్వడు పెట్టగలడు, అనుకున్నాడు. కొంప మునిగిపోదూ...అనుకున్నాడు. అలా అనుకున్నప్పుడే అతని కళ్ళల్లోకి ఏదో దురాలోచన పాములా ప్రాకింది. అతని చూపు విషాన్ని కక్కింది. 'ఈ శనిని విరగడ చేసుకుంటేనో' అనుకున్నాడు., అతని గుండె వేగంగా కొట్టుకుంది. ఎప్పుడూ మేలుకొని అతని అంతరాత్మ 'నరసన్నా ...ఎంత దుర్మార్గుడివి' అని మూల్గింది. నరసన్న వినిపించుకోలేదు. 'తీసుకు తీసుకు చచ్చే మందు పెట్టేస్తే సరి, పీడవదిలిపోతుంది...' అతని ఆలోచన రేగింది. 'రెండవ కంటికి తెలియనిస్తానా నేను' రేగిన ఆ ఊహ ఓ ఒడ్డున పడింది.

ఇలా అనుకోవడం ఏమిటి అతని కళ్ళల్లోకి చిట్టి అవతరించడం ఏమిటి...రెండూ ఒక్కసారే జరిగాయి. వెంటనే పెళ్ళి చేసుకోవాలి...అనుకున్నాడు. 'చిట్టి ఎంత బాగుంటుంది... నా భుజాల దగ్గర కొస్తుంది. ఏమో...ఎదిగేపిల్ల... నాకన్న ఎత్తు ఎదిగిపోతుందేమో...ఏడిసింది...' అనుకున్నాడు. 'అయినా రామయ్య రెండోపెళ్ళి వాడికిస్తాడో ఇయ్యడో...ఏడిశాడు ... పీడ్ని ఒప్పించడం ఎంతసేపు...'అనుకున్నాడు. తియ్యగా నవ్వుకున్నాడు. ఆ నవ్వు ఎంతసేపో అతని మొగం మీద నిలబడలేదు. సూరమ్మను అంతం చేయడం ఎలా అన్న ఊహ వచ్చి అలాగే మంచాని కంటుకపోయాడు.

రోజులు మెల్లిగా నడుస్తున్నాయి. నరసన్న తన పట్టు విడిచిపెట్టలేదు. కాని ఇప్పుడు భార్యతో ఎంతో మంచిగా మాట్లాడుతున్నాడు. "నాది ఉత్తుత్తి కోపమని నీకు తెలుసుగా...ఏమిటో పిచ్చిగా పేలుతూ వుంటాను. గొడ్రాలు వన్నా నని నీకు కోపంగా ఉంది కదూ...ఏమిటో బడిలో పిల్లల్ని చూస్తూ ఉంటానా...మనకి కూడ అలాంటిపిల్లలు ఉంటే ఎంతబాగుండును అని అనిపిస్తుంది. కాని ఏమిచేస్తాం. పోనిస్తూ...!" అనే వాడు. మరో రోజున, "నువ్వు చెప్పిందీ నిజమే... వాడిక్కడ కొచ్చినమీదట మన మనసులెలా ఉంటాయో...వాడి మనసు ఎలా ఉంటుందో... ఎందుకొచ్చిన గొడవలులే తిని ఉండలేక తీసి బొండ వేసుకోవడం..." అనేవాడు. మరోనాడు "సూరీ...నీకేమైనా తినాలని ఉంటే చేసుక తినరాదూ...అలా నీరసించుకపోతావేం...సంత నుంచి జిలేబీకాని, మిఠాయి కొమ్ములుగాని తెమ్మంటావేమిటి..." అనేవాడు.

ఈ మాటలలోని లోతులను తెలుసుకోలేని సూరమ్మ వాటిలోని విషాన్ని పసికట్టలేని పిచ్చి సూరమ్మ; తన భర్తకు తనమీద ఎంతో ప్రేమ ఉందనే నమ్మిందీ. పాపం పిల్లలకోసం ఎంతబాధ పడుతున్నాడో అనుకుంది. అప్పటినుంచీ ఆమెకు స్నానాలు, జపాలు, ఎక్కువైపోయాయి. ఆ చెట్టుకీ ఈ రాయికీ మ్రొక్కడం మొదలు పెట్టింది. సోదిచెప్పే మనిషిచేత సోది చెప్పించుకుంది.

ఆ రోజున వీధి గుమ్మంలో దీపం పెట్టుకొని, నరసన్నకోసం ఎదురుచూస్తూ అక్కడే కూర్చుంది. 'ఎప్పుడూ ఇంత ఆలస్యం చేయలేదు. ఏమిటో చీకటిలో తిరగడం...దగ్గరే సొమ్ముకూడా ఉంటుంది. ఏ దుష్టుడేనా తిరగబడి చంపితే... ఒక్కడూ ఏమి చెయ్యగలడు...అమ్మో...అనుకుంది. చీకటిలో పాములూ తేళ్ళూ తిరుగుతూ వుంటాయి. అన్నీ తుప్పలే...పాడు ఊరు... ఏమిటో చీకటి పడకముందే ఇంటికి చేరుకో

కూడదమ్మా...అన్నీ పెత్తనాలు తన నెత్తినే వేసుకుంటాడు.' అనుకుంటూ భర్తకోసం చీకటిని చీల్చుకుంటూ చూస్తోంది. ఆకు అలికిడైతే నరసన్న వస్తున్నట్లే తలెత్తి చూస్తోంది.

అప్పుడే నరసన్న వణుకుతూ ఇంటికివచ్చాడు. నరసన్న కోర్టులో వచ్చి అబద్ధాలు ఎన్నో కోట్లు చెప్పగలిగాడు. కాని అతనెప్పుడూ ఇట్లా వణకలేదు. అసలు నరసన్న జడ్జీ ప్రమాణం చెయ్యమన్నప్పుడు ఆజడ్జీ మొగంలోకి నవ్వుతూ చూసిన ఒకటోరకం ధీరుడు! కాని ఇప్పుడతను సూరమ్మ మొగంలోకి చూడలేక పోయాడు. ఇంట్లోకి అడుగు పెడుతూ తన మొగం మీదికి వెలుతురు పడకుండా చూసుకున్నాడు.

"ఇంత చీకటి పడేదాకా తిరుగుతావేం..." అంది సూరమ్మ. నరసన్నకు తల్లి జ్ఞాపకం వచ్చింది. నరసన్న గుండెలో ఆశ రెండెకరాల పొలంగా విస్తరించింది. నరసన్న నోరు కదపలేదు.

తిరిగి సూరమ్మ, 'నాకెంత భయమేసిందనుకున్నావ్...' అంది.

నరసన్న, 'ఎలా...ఎలా...' అనుకున్నాడు. ఒక్కసారిగా కంఠంలో కోరలు సృష్టించుకున్నాడు. 'అన్నం పెట్టు...' విషం కక్కినట్లు ఆ మాటలు కక్కాడు. తన గదిలోకి అడుగుపెట్టాడు.

"అదేంటీ...నీళ్ళోసుకోవూ..." అంది సూరమ్మ.

నరసన్న చికాకుపడి పోయాడు. కటువుగా 'నాకిప్పుడొద్దు..." మాటలను గట్టిగా నొక్కి కలికాడు.

"పోసుకో కూడదూ...ప్రాణానికి సుఖంగా ఉంటుంది" సూరమ్మ మెల్లిగా అంది.

నరసన్న ప్రాణం గిలగిల కొట్టుకుంది. ఎవరో అతని దేహంలో విప్లవం లేవదీస్తున్నారు. అతనిలో ఏవేవో శక్తులు అతన్ని చీల్చుతున్నాయి. కిరాతకుడు నరసన్న లొంగిపోలేదు. 'నీకేం చెప్పాను... అన్నం పెట్టమన్నానా లేదా' అని గర్జించాడు.

సూరమ్మ 'ఇదిగో పెడుతున్నా' భయపడుతూ అంది. అన్నం వడ్డించి దగ్గరగా కూర్చుంది. 'నీకేమయింది ఇవాళ్ళ...అలా ఉన్నావేం. అదేమిటి నీ మొగం అలా ఉందేం...ఎవరేనా ఏమైనా అన్నారా' అంది.

నరసన్న కంఠంలోకి మెతుకులు దిగడం మానేశాయి. వదిలేస్తే ఈ అన్నమే తినేసి ఇక అన్నం తినడం మానేస్తుందేమోనని ఊహించాడా ఖలుడు! గబగబా అన్నం తినేశాడు. వెంటనే పెగలని కంఠాన్ని సరిచేసుకొని, 'ఇదిగో సూరీ రామయ్యగారి యింటిదగ్గర కొన్ని కాగితాలు పొద్దుట విడిచిపెట్టాను గాని, వాటిని కొంచెం తెచ్చిపెడుదూ...' అన్నాడు. 'ఊఁ.. త్వరగా వెళ్ళిరావాలి' అని ఆమెను తొందర చేశాడు.

'ఇప్పుడే కావాలా అవి...అన్నం తినేసి వెళ్ళకూడదూ' అంది సూరమ్మ.

'నువ్వు అన్నం తినేసేలోగా అయితే నేనే వెళ్ళొస్తాను. తిరిగి తిరిగి వచ్చానేమో నా కాళ్ళు పీకిపోతున్నాయి. కొంచెం వేగం తెచ్చిపెడుదూ.. అవి కొంచెం అవసరం' అన్నాడు.

పాపం సూరమ్మ ఆ దుష్టుని మాటవింది. రామయ్యగారింటికి ఆ చీకటిలో బయలుదేరింది.

నరసన్న తనపనికి తాను ఉపక్రమించాడు. తనకు కడుపునిండ నిండుమనసుతో అన్నం పెట్టిన సూరమ్మకు, ఏమీ తెలియని అమాయకురాలికి విషం పెట్టడానికి ఉపక్రమించాడు. గబగబ వంట గదిలోకి వెళ్ళాడు. అన్నంమీద ఉన్న మూత తీశాడు. వణుకుతూన్న అతని చేయి మరింత వణికింది. అది వెనక్కి జంకింది. దీనంగా, "సూరమ్మ నిన్నేం చేసింది నరసన్నా..." అంది ఆ అన్నం. 'తల్లి లేదు...తండ్రిలేదు...నిన్నే దేవుడుగా నమ్ముకున్న ఆ ఉత్తమురాలిని చంపడానికి నీకు చేతులెట్లా వస్తున్నాయి.' అంది.

నరసన్న ఒక్కసారిగా కళ్ళను కెక్కరించుకున్నాడు. తలను పిడికిలితో బాదుకున్నాడు. భూమిమీద కాలు చుర్రుమనేలా చరిచాడు. 'చావు ముండా చావు...' అంటూ అన్నంలో ఆ మందు కలిపేశాడు.

ఆ అన్నం భయంకర రూపం దాల్చింది. అతని కడుపులోని అన్నం గిరగిర తిరిగింది. అతని తల ఒకటే శూలాలతో పొడిచేస్తున్నట్లు పోటు పెడుతోంది. నరసన్న పూర్తిగా భయపడిపోయాడు. ఇంత భయాన్ని అతను చనిపోయేముందు కూడా ఎదుర్కోడు! అయినా అతను సూరమ్మరాకకోసం ఎదురుచూస్తున్నాడు!

సూరమ్మ ఇంటికి తిరిగి వస్తోంది. నరసన్నకు ఏమో చెప్పాలని తొందర తొందరగా వస్తోంది. కీచురాళ్ళ రొదలు, ఆమెను భయపెడుతున్నాయి. పాము నోటిలో ఇరుక్కున్న కప్ప ఏడుపులు ఆమె గుండెలను కలవరపెడుతున్నాయి. ఒకకుక్క దారిలో భొంయ్...భొంయ్...మని మొరిగింది. సూరమ్మ పై ప్రాణాలు పైనేపోయాయి. చప్పున గుండెలమీద ఉమ్మివేసుకొంది. 'ఛీ...ఛీ...' అంది. భయంతో వణికిపోయింది. కుక్క ఆమెకు దగ్గరగావచ్చి చూచూచి తిరిగి మొరగలేదు. అక్కడక్కడ ఉన్న ఆ పూరిగుడిసెల్లోంచి ఇంత గుడ్డి వెలుతురు వీధిలో పడుతోంది. ఈదురుగాలికి తలుపులు మూతలుపడి ఆ కాస్త వెలుతురూ ఇట్టే అంతరించిపోతోంది. సూరమ్మ గబగబా అడుగులు వేస్తోంది. భయం ఆమెను తరుముతోంది. దారిలో బోలాలు, 'తల్లీ...నిన్ను ఇక దేవుడే రక్షించాలి' అన్నాయి. తుమ్మచెట్లు సూరమ్మ వస్తూన్న దారిలో ముళ్ళు పడకుండా చూస్తూ, 'తల్లీ ఈదారిని నువ్వు మళ్ళీ తిరుగుతావా...'అన్నాయి. చల్లనికాలువ జాలిగా, 'నీ అమృత హృదయమే నిన్ను కాపాడాలి తల్లీ...' అంది. సూరమ్మ గజగజ వణికిపోతూ ఇంటికి వచ్చింది. ఆమె వెనకనే రివ్వున గాలి వీచి, ఆమెను రక్షించడానికా అన్నట్లు ఆ గదిలోకి చొరబడింది.

గదిలో అడుగు పెడుతూ సూరమ్మ, "ఇంత చీకటిగా ఉంటుందనుకోలేదు ... ఎంత భయమేసింది" అంది. నరసన్న గుండెల్ని చేతితో పట్టుకున్నాడు.

సూరమ్మ, తను తెచ్చిన కాగితాలు నరసన్న చేతిలో పెడుతూ, "వాళ్ళ చిట్టి ఏమి చేసిందో చూశావా" అంది ఎంతో ఆయాసపడింది.

"ఆ...ఏమి చేసింది...ఏమి చేసింది చిట్టి" అన్నాడు సూరన్న.

"సినిమాలలో బంట్రోతేసాలేసే ఆ రామిగాడు లేడూ–"ఆమె గుండెల్లో దడ హెచ్చి కొద్దిగా ఆగింది.

ఆతృత నరసన్నను చీల్చింది. "ఆఁ...వాడేమి చేశాడు" అన్నాడు.

"ఆడితో అది లేచిపోయిందట. ఈ బండికే వెళ్ళిపోయారంట. పాడుముండ ఎంత పని చేసింది" అంది. తిరిగి, "ఇంకా నయం ఆ దొంగ ముండని నీ కిచ్చి పెళ్ళిచేయమని బ్రతిమాలా లనుకున్నాను. దాని కడుపునైనా ఒక కాయ కాస్తే మన వంశం నిలబడద్ది అనుకున్నాను" అంది.

అంతే. నరసన్నలోని విషహృదయం మంత్రించినట్లు తునాతునకలై పోయింది. మురికి గడ్డలను ఉడకబెట్టి చాకలి ఎంతో బాగా ఉతికి పిండుతూన్నట్లు అతని విషపూరిత హృదయాన్ని ఏదో అద్భుత శక్తి పిండివేసింది. ఏదో అమృత హృదయం అంతరించిపోయిన అతని అంతరాత్మకు ప్రాణం పోసింది. ఏదో ప్రతిఫలాపేక్షారహిత త్యాగబలం అతన్ని సమూలంగా పునీతుణ్ణి చేసింది!

నరసన్న దబ్బున భూమిమీదికి కూలబడిపోయాడు. సూరమ్మ పాదాలు పట్టుకున్నాడు. 'నేను హంతకుణ్ణి... నేను హంతకుణ్ణి...'అన్నాడు. గబగబా వంటగదిలోకి పరుగెత్తాడు. ఆ అన్నపు కుండ కాదు... కాదు...విషభాండం నెత్తిని పెట్టుకొని వీధిలోకి పరుగెత్తాడు. విసపు కూడును ఊరవతల కప్పెట్టడానికి, విసపు గుండెను ఈ లోకానికి కావల పాతిపెట్టడానికి పారిపోతున్నాడు.

"ఏమిటిదంతా... ఎక్కడికీ ఇంత చీకటిలో... అదేమిటీ అన్నపుకుండ దేకికీ... నీకేమయింది..." అంటూనే ఉంది సూరమ్మ.

కాని అతనలాగే పరుగెత్తుతున్నాడు.

---

"అమ్మా అమ్మా! నాన్న హాల్లో కుర్చీల్లో కూర్చున్నవాడల్లా అమాంతం మూర్ఛపోయాడే! త్వరగా రా! చేతిలో ఏదో కాగితం ఉంది. ఎవడో ఆసామీ తెచ్చి యిచ్చాడు. అది చూశాకే నాన్న పడిపోయాడు!"

"ఆఁ మరేం ఫరవాలేదు. నిన్న నేను కొన్న చీరల బిల్లు అయుంటుంది."